క్లుప్తంగా

బోరుబావి పనులకు శ్రీకారం


బోరు బావి ఏర్పాటుకు పూజ చేస్తున్న ఎంపీపీ

చిలమత్తూరు: మండల కేంద్రంలో అక్కమ్మ గుడి వద్ద బోరుబావి తవ్వకాన్ని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, ఎంపీటీసీ కవితలు గురువారం ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ భక్తులకు నీటి సదుపాయం కల్పించేందుకు బోరు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ దివాకర్ రెడ్డి, హరి పాల్గొన్నారు.

రొళ్ల: దొమ్మరహట్టి గ్రామంలో బుధవారం రాత్రి మండల ప్రజా పరిషత్ గ్రాంట్ కింద బోరు తవ్వించారు. 800 అడుగుల వరకు డ్రిల్లింగ్ చేయగా 3 ఇంచులకుపైగా నీరు లభించింది. ఉప సర్పంచ్ రాజు పాల్గొన్నారు. కొడగార్లగుట్ట కాలనీలో బోరు బావి తవ్వించేందుకు సర్పంచ్ ప్రకాష్ చర్యలు తీసుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

హిందూపురం: 32వ వార్డుకు చెందిన 43ఏళ్ల సాదిక అనే మహిళ అనారోగ్యంతో పదిరోజుల క్రితం మృతి చెందింది. వైఎస్సార్ బీమా కింద ఆ కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10వేలను కౌన్సిలర్ షేక్ రేష్మాబాను, వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబు గురువారం అందజేశారు.

కంప్యూటర్ల వితరణ

లేపాక్షి: మండలంలోని మైదుగోళం ప్రాథమికోన్నత పాఠశాలకు బెంగళూరుకు చెందిన దాతలు డేవిడ్ రమేష్, బాలు, గిని రెండు కంప్యూటర్లు వితరణ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్షీరలింగేశ్వర్‌కు గురువారం కంప్యూటర్లను అందజేశారు. ఎంఈఓ-2 కుళ్లాయప్ప, పాఠశాల కమిటీ చైర్మన్ జుబేర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీరాములు, సురేష్‌బాబు, ముస్తాఫా పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనే ధ్యేయం

పావగడ: అవినీతి నిర్మూలనకు లోకాయుక్త పనిచేస్తోందని లోకాయుక్త డీఎస్పీ జీ మంజునాథ్ తెలిపారు. టీపీఎస్ మీటింగ్ హాలులో గురువారం నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు వెంటనే పనులు చేయాలన్నారు. అనంతరం అర్జీలు స్వీకరించారు తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకిరామ్, ఎస్ఐ మహ్మద్ సలీం పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలి

అమరాపురం: విరుపసముద్రం నుంచి అమరాపురం వరకు తారు రోడ్డును డబుల్ రోడ్డు నిర్మించాలని అమరాపురం జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క విజ్ఞప్తి చేశారు. గురువారం అనంతపురానికి విచ్చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

నోరు అదుపులో పెట్టుకోండి

పావగడ: మాజీ సీఎం కుమారస్వామిని హేళన చేస్తున్న మాజీ మంత్రి వెంకటరమణప్పనోరు అదుపులో పెట్టుకోవాలని జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్సి అంజినప్ప హెచ్చరించారు. స్థానిక జేడీఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో జేడీఎస్, బీజేపి పొత్తు కుదుర్చుకుంటే మీకు ఎందుకు వణుకు పుడుతోందని ప్రశ్నించారు.

'శ్రావణ' పూజలకు తెర

పావగడ: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక శనేశ్వర దేవాలయంలో గత నెల 17న ప్రారంభమైన పూజలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా శనేశ్వర స్వామికి తైలాభిషేక పూజలు, నవగ్రహ పూజలు ఘనంగా నిర్వహించారు. శీతలాంబదేవి అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి.

ముగిసిన ఆటల పోటీలు


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పరిగి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పరిగి జెడ్పీ ఉన్నత పాఠశాల, కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్ క్రీడా మైదానాల్లో నిర్వహిస్తున్న మండల స్థాయి ఆటల పోటీలు గురువారం ముగిశాయి. ప్రతిభ చాటిన క్రీడాకారులు త్వరలో జరిగే నియోజకవర్గ ఆటల పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

చైన్‌స్నాచింగ్

మడకశిర రూరల్: కోడిపల్లి సమీపంలో చైన్‌స్నాచింగ్ చోటు చేసుకుంది. వైబీ హళ్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవానికి కోడిపల్లి అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు లక్ష్మీదేవి హాజరైంది. తిరిగి గ్రామానికి కాలి నడకన వెళ్తుండగా బైక్‌లో వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని 30 గ్రాముల బంగారు గొలుసు, సెల్‌ఫోన్ లాక్కెళ్లారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం


సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

- హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక

హిందూపురం: రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని హిందూపురం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. మున్సిపాలిటీలోని 10వ వార్డు కౌన్సిలర్ పార్వతీ ఆధ్వర్యంలో లక్ష్మీపురం, పులమతి రోడ్డులో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు, వీధిలైట్లు వేయించాలని కొన్ని ప్రాంతాల్లో ప్రజలు కోరారు. టీఎన్ దీపిక మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందజేస్తోందన్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. ఇనేళ్లూ హిందూపురంలో గెలుస్తూ వచ్చిన టీడీపీ ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించి సమస్యలు తెలుసుకున్న దాఖలాలు లేవన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే టీడీపీకి ప్రజలు గుర్తుకు వస్తారన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ సినిమా డైలాగులు తప్ప ప్రజలకు, నియోజకవర్గానికి చేసింది శూన్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో షాజియా, చంద్ర, నాయకులు నాగరాజు, నాగమణి, కవిత, చాంద్‌బాషా, తిమ్మారెడ్డి, భారతీ, కృష్ణగౌడ్, శివరామిరెడ్డి, ఆదినారాయణప్ప సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- సీడీపీఓ నాగమల్లేశ్వరి

మడకశిర రూరల్: బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం పౌష్టికాహారం పంపిణీ చేస్తోందని మడకశిర ప్రాజెక్టు సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. గురువారం వైబీహళ్లిలో పంచాయతీ స్థాయి పౌష్టికాహార మాసోత్సవాలు, సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సంప్రదాయబద్ధంగా సీమంతాలు చేసి చిరుధాన్యాలు, ఆకుకూరలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ పరిశీలించారు. సీడీపీఓ మాట్లాడుతూ చిరుధ్యానాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. అనంతరం తల్లిపాలు ప్రాముఖ్యత, 108 సేవలు, జగనన్న ఆరోగ్య సురక్షపై కల్పించారు. సూపర్‌వైజర్ లీలావతి, వైద్య, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలో జరిగిన పౌష్టికాహార వారోత్సవాల్లో సీడీపీఓ అనురాధ పాల్గొని పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు.

ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలి

పరిగి: పంటల సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి విజయభారతి రైతులకు సూచించారు. ఊటుకూరు, యర్రగుంట, బీచిగానిపల్లి గ్రామాల పరిధిలో జరుగుతున్న ఈపంట నమోదు ప్రక్రియను గురువారం ఆమె పరిశీలించారు. మండల పట్టు పరిశ్రమ శాఖ అధికారి నంజుండప్పతో కలిసి పొలాలకు వెళ్లి వరి, మిరప, మల్బరీ పంటలను పరిశీలించారు. వరిలో ఆశించే చీడపీడలను, అగ్గి తెగులు నివారణ చర్యలపై రైతులకు వివరించారు.

టీవీ కేబుల్ వైర్ తగిలి మహిళకు గాయాలు

అమరాపురం: టీవీ కేబుల్ వైర్ తగిలి మహిళ గాయపడింది. మండలంలోని కాచికుంట గ్రామానికి చెందిన కరియమ్మ గురువారం పొలం పనులకు వెళుతుండగా హేమావతి రోడ్డులో టీవీ కేబుల్ తీగ తగిలి కింద పడిపోయింది. తలకు గాయాలు కావడంతో శిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

హిందూపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సూచించారు. గురువారం మున్సిపల్ ఆఫీసులో ఏఎస్ఎం, అడ్మిషన్ కార్యదర్శులతో ఆయన సమావేశమై మాట్లాడారు. నేటినుంచి వార్డు వాలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులతో కలిసి వార్డు ఆరోగ్య కార్యదర్శులు క్యాంపెయిన్ నిర్వహించాలని చెప్పారు.

పరిగి: ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తూ, ఇంటింటికీ వైద్య సేవలందించడమే లక్ష్యంగా చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం పరిగి మండల కేంద్రంలో సచివాలయం-1 పరిధిలో ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. 15 రోజుల పాటు ఈ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు వెళ్లి ప్రజల ఆరోగ్యస్థితిగతులపై సర్వే చేస్తారన్నారు. అక్టోబర్ 18 వరకూ అన్ని గ్రామ సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లేపాక్షి: జగనన్న ఆరోగ్య సురక్షపై మండలంలోని మానేపల్లి గ్రామ సచివాలయంలో గురువారం వలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఈఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించి యాప్‌లలో నమోదు చేయాలన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్


లేపాక్షి: మాట్లాడుతున్న ఎంపీహెచ్ఈఓ సుబ్రహ్మణ్యం

చిలమత్తూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, గృహసారథులు వైద్యులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని ఎంపీడీఓ నరేష్‌కృష్ణ సూచించారు.

అమరాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎంపీపీ ఈరన్న, ఎంపీడీఓ మునిస్వామి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో ఎవరికైనా వ్యాధులు ఉంటే గుర్తించి జగనన్న సురక్ష కార్యక్రమంలో తెలియజేయాలని సూచించారు. వైస్ ఎంపీపీ క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: గ్రామాలలో నేటి నుంచి ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివశంకరప్ప తెలిపారు. ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని సూచించారు.

రొళ్ల: రత్నగిరి సచివాలయం పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' పై ఇంటింటా సర్వేను ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ ఆజాద్, ఈఓఆర్డీ క్రిష్ణప్ప తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

అర్హులందరికీ సామాజిక భద్రతా పింఛన్లు


హరేసముద్రంలో పింఛన్ల పంపిణీ


లేపాక్షి: పింఛన్లు అందజేస్తున్న దృశ్యం

రొళ్ల: గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి పింఛన్ మంజూరు అవుతుందని బీజీ హళ్లి సర్పంచ్ సదాశివప్ప, కాకి వైస్ సర్పంచ్ రాజు, అన్నారు. బీజీ హళ్లిలో 49 మందికి, కాకి గ్రామంలో 35 మందికి నూతనంగా మంజూరైన పింఛన్లను గురువారం బ్ధిదారులకు అందజేశారు. నాయకులు బసవరాజు, లోకేష్, సచివాలయం కన్వీనర్ ముడుపేగౌడు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: హరేసముద్రం పంచాయతీకి కొత్తగా 50 పింఛన్లు మంజూరు కాగా సర్పంచ్ కరియన్న గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల కోఆప్షన్ సభ్యుడు ప్రకాష్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: శ్రీరంగరాజుపల్లిలో వైస్ ఎంపీపీ వేదవతి, సర్పంచ్ మల్లక్క, వైస్ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి, ఎస్సీ సెల్ పార్లమెంటరీ కార్యదర్శి కిరణ్ గురువారం 39 మందికి పింఛన్లు అందజేశారు.

గోరంట్ల: గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని ఐదు సచివాలయల పరిధిలో 110 నూతన సామాజిక భద్రత పింఛన్లను గురువారం లబ్ధిదారులకు అందజేశారు. 1వ సచివాలయంలో సర్పంచ్ సరోజబాయి, వైఎస్సార్‌సీపీ నాయకులు పింఛన్లను అందజేశారు. పాలసముద్రంలో సర్పంచ్ గంగప్ప ఆధ్వర్యంలో పింఛన్లు అందజేశారు.

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం, పులమతి గ్రామాల్లో కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ అశ్వత్తనారాయణ లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగే వారమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అర్హులందరికీ పింఛన్లు అందుతున్నాయని తెలిపారు. ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మునిమడగు గ్రామ సచివాలయలో 24 మందికి సర్పంచ్ అశ్వర్థనారాయణ, వైస్ ఎంపీపీ చంద్రకళ, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు పింఛన్లు అందజేశారు.

అగళి: మండలానికి 239 నూతన పింఛన్లు మంజూరు కాగా గురువారం ఆయా గ్రామ సచివాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

హిందీపై అవగాహన అవసరం

హిందూపురం: దేశభాషల్లో హిందీకి ప్రాముఖ్యత ఉందని బాలాజీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీరభద్రప్ప అన్నారు. గురువారం కళాశాలలో జరిగిన హిందీ భాషా దినోత్సవంలో అయన పాల్గొని మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో దేశప్రజలను సమైక్యం చేసిన ఘనత హిందీ భాషకు దక్కుతుందన్నారు. హిందీభాషతో దేశంలో ఉపాధి అవకాశాలు పొందడానికి సులభతరం అవుతుందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అనంతపురం ఆర్ట్స్ కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకులు కిరణ్ మాట్లాడుతూ హిందీ భాషపై అవగాహన పెంచుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రొద్దం: మండలంలోని కోగిర జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాబిలి చాంద్‌బాషా ఆధ్వర్యంలో, సానిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలు జయమ్మ ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు.

పరిగి: మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం హిందీ భాష దినోత్సవం నిర్వహించారు. కోనాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా స్థాయి ఉత్తమ హిందీ ఉపాధ్యాయినిగా అవార్డు అందుకున్న హెబ్బిబాగ్రేస్‌ను సన్మానించారు.


అవార్డు గ్రహీత హెబ్బిబాగ్రేస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

లేపాక్షి: స్థానిక గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ హిందీ నేర్చుకుంటే దేశంలో మనుగడ సాగించవచ్చన్నారు. హిందీ ఉపాధ్యాయులు హబీబుల్లా, అబ్దుల్ రెహమాన్‌లను సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ మురళీధర్‌మూర్తి పాల్గొన్నారు.

అగళి: మండలంలోని కేజీబీ పాఠశాలలో హిందీ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రంగవల్లికలతో హిందీ అక్షరాల చార్టులతో వేదికను అలంకరించారు. సీనియర్ ఉపాధ్యాయునులు రాధిక, ఉమాదేవి, ఆశాజ్యోతి, శైలజ, హిందీ ఉపాధ్యాయిరాలు గాయత్రిని సన్మానించారు. హెచ్ఎం జ్యోతిలత పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు గడప గడపకూ...

గుడిబండ: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం గుడిబండ సచివాలయం-1 పరిధిలోని గుడిబండ, కూగీరనపాళ్యం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రాధమ్మ తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పాల్గొంటారన్నారు.

పారదర్శకంగా ఈ -క్రాప్ బుకింగ్

మడకశిర రూరల్: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన వివిధ పంటలను పరిశీలించి పారదర్శకంగా ఈ -క్రాప్ బుకింగ్ నమోదు చేయాలని ఏఓ తిమ్మప్ప ఆర్బీకే సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన గ్రామాల్లో పర్యటించి ఈ- క్రాప్ బుకింగ్ నమోదును పరిశీలించారు. ఈనెల 30 లోపు ఈ-క్రాప్ బుకింగ్ నమోదు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు


శ్రీకృష్ణ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గోరంట్ల: కృష్ణాష్టమిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో గోరంట్లలోని పాత స్టేట్ బ్యాంకు అవరణలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని ప్రతిమకు తొమ్మిది రోజులపాటు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను అత్యంత భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకానికి విత్తనాల పంపిణీ

గుడిబండ: మండల పరిధిలోని ముతుకూరు, కె.కె.పాళ్యం, కురుబరపల్లి మద్దనకుంట గ్రామాల్లోని రైతులకు ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఎర్రచందనం, టేకు, మహాగని, శ్రీగంధం, అవిశ, మద్ది, మలబార్ విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. సంస్థ ఫీల్డ్ ఫీల్డ్ సూపర్‌వైజర్ రమేష్, సర్పంచ్ జగదాంబ పాల్గొన్నారు.

కారుబోల్తా, ఇద్దరికి గాయాలు



సోమందేపల్లి: మండలంలోని కావేటి నాగేపల్లి గ్రామ సమీపంలో గురువారం కారు బోల్తా పడి ఇద్దరు గాయపడ్డారు. అనీల్, ఇంతియాజ్ అనే వ్యక్తులు గోరంట్ల నుంచి కారులో హిందూపురం వెళుతుండగా నాగేపల్లి వద్ద మలుపులో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. గాయపడిన అనీల్‌ను హిందూపురం ఆసుపత్రికి తరలించారు.



స్కూల్ బస్సులు కండీషన్‌లో ఉండాలి

రొళ్ల: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల సౌకర్యార్థం గ్రామాల నుంచి తిప్పుతున్న స్కూల్ బస్సులను సరైన కండీషన్‌లో ఉంచుకోవాలని ఎంఈఓ-2 శ్రీధర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మురళి, లక్ష్మీవిద్యానికేతన్, బాలాజీ రూరల్ అప్పర్ ప్రైమరీ ప్రైవేట్ పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. స్కూల్ బస్సులకు సంబంధించిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లపై ఆరా తీశారు.

నీటి సమస్య తీర్చండి

హిందూపురం: మోడల్‌కాలనీ-2లో నీటి ఎద్దడి పరిష్కరించాలంటూ కాలనీవాసులు గురువారం సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ చాంబర్ ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళన నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం



సత్యనారాయణరావు, గిరిజాకుమారి, కిష్టప్పను సత్కరిస్తున్న దృశ్యం

మడకశిర: ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న గుర్రపుకొండ, హరేసముద్రం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సత్యనారాయణరావు, గిరిజాకుమారిలను గురువారం ఎంఈఓ కార్యాలయంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఎమ్మార్సీ సిబ్బంది గోవింద్‌నాయక్, రంగనాథ్, శ్రీరాములను కూడా సన్మానించారు. కె.భూతన్న, వీ.ఎస్.మహలింగప్ప మూడ్లగిరియప్ప, డి.నరసింహప్ప, బి.ఈశ్వరప్ప, హెచ్.సుదర్శన్, పి.ఓబన్న పాల్గొన్నారు.

సోమందేపల్లి: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న చల్లాపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కిష్టప్పను గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు సన్మానించారు.

ఐటీ వింగ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మారుతి


ఎం.మారుతి

హిందూపురం: వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా హిందూపురం నియోజకవర్గానికి చెందిన ఎం.మారుతిని నియమిస్తూ కేంద్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. తన సేవలను గుర్తించి రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించినందుకు సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మారుతి తెలిపారు.

మల్బరీ షెడ్డు దగ్ధం

సోమందేపల్లి: మండలంలోని మండ్లి గ్రామ సమీపంలో శ్రీనివాస్ రెడ్డి అనే రైతు మల్బరీ షెడ్డు ఏర్పాటు చేశాడు. గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో షెడ్డు, గడ్డి, ఇతర వ్యవసాయ పరికరాలు కాలి బూడిదయ్యాయి. చుట్టుపక్కల ఉన్న రైతులు, కూలీలు వచ్చి మంటలు ఆర్పారు. రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

వైఎస్సార్ బీమా అందజేత

లేపాక్షి: మండల కేంద్రానికి చెందిన బి.నాగరాజు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద నాగరాజు భార్య ఆదెమ్మకు గురువారం రూ.10 వేలు గ్రామ సర్పంచ్ ఆదినారాయణ అందజేశారు.